వనం..మనం.. మనఊరి కోసం
RNI/APTEL/26/A3829
ప్రభ మనం
TELUGU DAILY తెలుగు డైలీ
Gmail: prabhamanam@gmail.com

విలేకరులు కావలెను.
WANTED... WANTED...
ఆంధ్ర, తెలంగాణ నుండి వెలువడుతున్న తెలుగు జాతీయ దినపత్రిక ప్రభ మనం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్సీ ఇంచార్జీలు,సిసి ఇంఛార్జీలు మరియు మండల విలేకరులు కావలెను. ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
ఎడిటర్: వి. లింగమూర్తి
9000367833, 8074937223

కర్నూలు : ఎడిటర్ - వడ్డే లింగమూర్తి | సంపుటి : 1 సంచిక : 36 | పేజీలు : 4 వెల రూ./-4 | email: prabhamanam@gmail.com | బుధవారం 24-06-2026

వడ్డెరలకు ఇచ్చిన

# హామీని నెరవేర్చాం



- ❖క్వారీల్లో వడ్డెరలకు 33 శాతం కేటాయిస్తామని యువగళం సమయంలో లోకేశ్ హామీ
- ❖వడ్డెరలకు 33 శాతం కేటాయిస్తూ జీవో జారీ చేసిన ప్రభుత్వం
- ❖తమది చేతల ప్రభుత్వం అన్న లోకేశ్

వడ్డెర సామాజికవర్గానికి క్వారీల్లో 33 శాతం వాటా కేటాయించాలని యువగళం పాదయాత్ర - మిగతా 2 లో

## ఫార్మాసిటీ అగ్నిప్రమాదం

విశాఖ పరిశ్రమలపై పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు



- ★విశాఖ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం, ఇద్దరు కార్మికుల మృతి
- ★పరిశ్రమల్లో తక్షణమే సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని పవన్ ఆదేశం
- ★మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా

విశాఖపట్నం సమీపంలోని అనకాపల్లి జిల్లా, పరవాడ ఫార్మా సిటీలో జరిగిన ఘోర - మిగతా 2 లో

# ఉద్యోగులపై వరాల జల్లు
# భారీ పెట్టుబడులకు ఆమోదం

### ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు

- ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు.. రూ.39,355 కోట్ల పెట్టుబడులకు ఆమోదం
- రాష్ట్రంలో 34,610 మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలకు గ్రీన్ సిగ్నల్
- అమరావతి పనుల వేగవంతం.. మౌలిక వసతులకు టెండర్లకు ఆమోదం
- కొందరు ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం.. పీఎస్‌యూల్లో రిటైర్మెంట్ వయసు 62కి పెంపు
- మచిలీపట్నం, రామయ్యపట్నం పోర్టుల పరిధుల క్రమబద్ధీకరణ, పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు




ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రానికి భారీ ఎత్తున

## స్టాలిన్ మేనరిజంను అనుకరించి

# చూపించిన విజయ్

- అంతా అయిపోయింది అసెంబ్లీలో స్టాలిన్‌ను అనుకరించిన ముఖ్యమంత్రి విజయ్
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై తీవ్ర వాగ్వాదం
- డీఎంకేపై తీవ్ర ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రి విజయ్
- ముఖ్యమంత్రి ప్రసంగానికి నిరసనగా డీఎంకే ఎమ్మెల్యేల వాకౌట్
- అవినీతి కేసులను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్న ముఖ్యమంత్రి



తమిళనాడు శాసనసభ మంగళవారం నాటి సమావేశాల్లో తీవ్ర వాదోపవాదాలు, నాటకీయ పరిణామాల మధ్య అట్టుడికింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చ సందర్భంగా

## 'ప్రపంచాన్నే అధిగమిస్తాం' కిమ్ అణు ప్రకటనతో కలకలం!



- ★అణ్వాయుధాలను మరింత పెంచాలని కిమ్ పిలుపు
- ★'ప్రపంచాన్ని మించే స్థాయికి చేరాలి' అని వ్యాఖ్య
- ★అణ్వస్త్రాలే దేశ రక్షణకు ప్రధాన బలమన్న ఉత్తర కొరియా
- ★అమెరికా-దక్షిణ కొరియా సైనిక సహకారంపై విమర్శలు
- ★10 వేల టన్నుల క్షిపణి యుద్ధనౌక నిర్మాణానికి వేగం

అణ్వాయుధాల విషయంలో ఉత్తర కొరియా మరోసారి దూకుడు ప్రదర్శించింది. - మిగతా 2 లో

## 8 మంది రెబెల్ ఎమ్మెల్యేలపై వేటు వేసిన మమతా బెనర్జీ



- ➢మమతా బెనర్జీ స్థానంలో పార్టీ కొత్త అధ్యక్షుడిని ప్రకటించిన రెబల్ వర్గం
- ➢మరుసటి రోజే 8 మంది కీలక నేతలపై వేటు వేసిన మమత
- ➢టీఎంసీలో తార స్థాయికి చేరిన అంతర్గత పోరు

తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పోరు తార స్థాయికి చేరింది. 1998లో పార్టీని స్థాపించి, - మిగతా 2 లో

## రేవంత్ ఏ స్కీమ్ తెచ్చినా.. దాని వెనుక స్కాం ఉంటుంది

- ●రేవంత్ కన్ను మెట్రో భూములపై పడిందన్న కేటీఆర్
- ●సొంత మనుషులకు భూములు కట్టబెట్టేందుకే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపణ
- ●రేవంత్, కిషన్ రెడ్డి ఢిల్లీలో కొత్త డ్రామా మొదలుపెట్టారని ఆరోపణ



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డికి ఒక్కటే ఎజెండా ఉందని, అది మెట్రో భూముల స్కామ్ అని మండిపడ్డారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన కేటీఆర్, "రేవంత్ రెడ్డి కన్నంతా - మిగతా 2 లో

## సీఎం రేవంత్ కోసం కేంద్రమంత్రులతో

# సమావేశాలు ఏర్పాటు చేశా



- రేవంత్‌రెడ్డి రెండుసార్లు లేఖ రాసినట్లు వెల్లడించిన కిషన్ రెడ్డి
- జూన్ 22న అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేసినట్లు వెల్లడి
- ఇవాళ ఖట్టర్, అశ్విని వైష్ణవ్‌తో సంయుక్త భేటీ జరిగినట్లు తెలిపారు
- సమావేశాలు సానుకూల వాతావరణంలో జరిగాయని వెల్లడి
- తెలంగాణ అభివృద్ధికి ఎప్పుడూ కృషి చేస్తానన్న కేంద్ర మంత్రి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేసినట్లు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. గత రెండు రోజులుగా ఢిల్లీలో రేవంత్‌రెడ్డి పలువురు కేంద్ర

## హర్మ్యూజ్ జలసంధిలో రికార్డు స్థాయిలో ఆయిల్ రవాణా



- ○హర్మ్యూజ్ జలసంధిలో ఒక్కరోజే 19 మిలియన్ బ్యారెళ్ల ఆయిల్ రవాణా
- ○ఇరాన్‌తో ఒప్పందం వల్లే ఇది సాధ్యమైందని ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్
- ○ఈ పరిణామంతో ప్రపంచవ్యాప్తంగా తగ్గుముఖం పడుతున్న చమురు ధరలు

అమెరికా,ఇరాన్‌మధ్య ఇటీవల కుదిరిన ఒప్పందంఆశించిన సత్ఫలి తాలనిస్తోందని, హర్మ్యూజ్ జలసంధి ద్వారా చమురు - మిగతా 2 లో

## కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ కోసం మరో స్థలం

- ➢రామ్మోహన్ నాయుడితో తుమ్మల, ఉత్తమ్ భేటీ
- ➢కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని తుమ్మల, ఉత్తమ్ విన్నపం
- ➢భద్రాచలంకు దేశ, విదేశాల నుంచి భక్తులు వస్తుంటారన్న మంత్రులు
- ➢సానుకూలంగా స్పందించిన రామ్మోహన్ నాయుడు



తెలంగాణలో విమానయాన కనెక్టివిటీని పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి.. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని ప్రత్యేకంగా కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 'కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్'- మిగతా 2 లో

## వడ్డెరలకు ఇచ్చిన హామీని నెరవేర్చాం

మొదటిపేజీ తరువాయి – సమయంలో నారా లోకేశ్ ఇచ్చిన హామీని నెరవేర్చుతూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వడ్డెరలకు 33 శాతం వాటా కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నం. 126 జారీ చేసింది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, "యువగళం పాదయాత్రలో ప్రజలు పడుతున్న కష్టాలను ప్రత్యక్షంగా చూశాను. ఆ సమయంలో వడ్డెర సోదరులు తమ కులవృత్తిని కొనసాగించడానికి క్వారీలు కేటాయించాలని నన్ను కోరారు. ఆనాడు ఇచ్చిన హామీ మేరకు ఈ జీవో జారీ చేశాం" అని తెలిపారు. తమ ప్రభుత్వం చేతల ప్రభుత్వం అని చెప్పారు. "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని లోకేశ్ వ్యాఖ్యానించారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నామని అన్నారు. మరోవైపు, కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై వడ్డెర సంఘాల నేతలు, కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ కులవృత్తికి ప్రభుత్వం గుర్తింపు ఇచ్చినందుకు వారు మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు.c

## ఫార్మాసిటీ అగ్నిప్రమాదం

మొదటిపేజీ తరువాయి – అగ్నిప్రమాదంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆయన, విశాఖ పారిశ్రామిక ప్రాంతంలోని అన్ని పరిశ్రమల్లో తక్షణమే భద్రతా తనిఖీలు (సేఫ్టీ ఆడిట్) నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరవాడ మండలం, జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీలోని 'దక్షినా ఎనర్జీ' కెమికల్ ఫ్యాక్టరీలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు చెలరేగి వేగంగా వ్యాపించడంతో ఇద్దరు కార్మికులు లోపలే చిక్కుకుని సజీవదహనమయ్యారు. మరో ఇద్దరు గాయపడగా, వారిని మెరుగైన చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన గురించి తెలియగానే పవన్ కల్యాణ్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠినమైన భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ దుర్ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ద

## రేవంత్ ఏ స్కీమ్ తెచ్చినా.. దాని వెనుక స్కాం ఉంటుంది

మొదటిపేజీ తరువాయి – మెట్రో భూముల మీదే పడింది. ఏ స్కీమ్ తెచ్చినా దాని వెనుక ఒక స్కామ్ పక్కా ఉంటుంది" అని ఆరోపించారు. మెట్రో సమీపంలో 280 ఎకరాల విలువైన భూములు ఉన్నాయని, వీటి విలువ సుమారు రూ.30 వేల కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి ఈ భూములను తన అన్నదమ్ములు, బావమరుదులు, అల్లుళ్లకు కట్టబెట్టడానికే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. దీని కోసం ప్రజలపై రూ.14 వేల కోట్ల భారం మోపారని విమర్శించారు."కేసీఆర్ ప్రభుత్వం 72 కిలోమీటర్ల మెట్రోను బ్రహ్మాండంగా నిర్మించింది. ఎయిర్‌పోర్ట్ మెట్రో టెండర్లు కూడా పూర్తి చేసి, 2023 జూన్–జులైలోనే పనులు ప్రారంభించాల్సి ఉండగా, రేవంత్ రెడ్డి వచ్చి ఎయిర్‌పోర్ట్ మెట్రోను రద్దు చేశారు. ఇది తుగ్లక్ నిర్ణయం" అని కేటీఆర్ మండిపడ్డారు. ఎయిర్‌పోర్ట్ మెట్రో కొనసాగి ఉంటే ఈ పాటికి పూర్తి అయి ఉండేదని చెప్పారు. భూసేకరణ సమస్య కూడా లేకుండా, ఔటర్ రింగ్ రోడ్డును అనుసంధానం చేసి ట్రాఫిక్ సమస్యలు తగ్గించాలని ఆలోచన చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రస్తుతం కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఢిల్లీలో కొత్త డ్రామా మొదలుపెట్టారని, మళ్లీ మెట్రో పనులు ప్రారంభించాలంటే 2028లో కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా చేయాల్సి ఉంటుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.


## సీఎం రేవంత్ కోసం కేంద్రమంత్రులతో సమావేశాలు ఏర్పాటు చేశా

మొదటిపేజీ తరువాయి – మంత్రులతో భేటీ అయ్యేలా తాను సమన్వయం చేసినట్లు వెల్లడించారు. జూన్ 22న అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం జరిగిందని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఇవాళ కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్‌తో కలిసి మరో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. ఈ సమావేశాలు సానుకూల వాతావరణంలో జరిగాయని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి తనకు రెండుసార్లు లేఖ రాసి కేంద్ర మంత్రులతో భేటీకి అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు. కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణ ప్రతినిధిగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఎప్పుడూ కృషి చేస్తానని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణకు సంబంధించిన అభివృద్ధి అంశాల్లో తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

## కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ కోసం మరో స్థలం

మొదటిపేజీ తరువాయి – నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని వారు కేంద్రమంత్రికి అధికారికంగా విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం వద్ద గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం గతంలో రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై సివిల్ ఏవియేషన్ శాఖ ఇప్పటికే ఒక 'ఫీజిబులిటీ సర్వే' నిర్వహించింది. త్వరితగతిన సర్వే చేయించినందుకు రామ్మోహన్ నాయుడికి ఈ సందర్భంగా తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఆ టెక్నికల్ సర్వేలో మొదట అనుకున్న స్థలం విమానాశ్రయ నిర్మాణానికి అనువుగా లేదని తేలడంతో.. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మరో ప్రత్యామ్నాయ స్థలాన్ని ప్రతిపాదించినట్లు తుమ్మల చెప్పారు. కొత్తగా ప్రతిపాదించిన స్థలంలో త్వరగా టెక్నికల్ అండ్ సేఫ్టీ ఫీజిబులిటీ సర్వే నిర్వహించాలని, గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్ట్ త్వరగా పట్టాలెక్కేలా కేంద్రం చొరవ చూపాలని మంత్రులు కోరారు. దీనిపై కేంద్రమంత్రి కూడా సానుకూలంగానే స్పందించినట్లు తెలుస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎయిర్‌పోర్ట్ ఎందుకు అవసరమనే దానికి మంత్రులు బలమైన కారణాన్ని కేంద్రానికి వివరించారు. ఇక్కడ ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం, 'దక్షిణ అయోధ్య'గా ప్రసిద్ధి చెందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయానికి దేశ, విదేశాల నుంచి ప్రతిరోజూ భక్తులు వస్తుంటారని గుర్తుచేశారు. ఎయిర్‌పోర్ట్ వస్తే ఇటు భక్తులకు కనెక్టివిటీ పెరగడంతో పాటు, ఇండస్ట్రియల్‌గా కూడా ఈ ఏరియా బాగా డెవలప్ అవుతుందని స్పష్టం చేశారు.

## హర్మూజ్ జలసంధిలో రికార్డు స్థాయిలో ఆయిల్ రవాణా



మొదటిపేజీ తరువాయి – రవాణా తిరిగి భారీగా పుంజుకుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. సోమవారం ఒక్కరోజే ఈ జలసంధి గుండా 1.9 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా జరిగిందని, ఇది ఒక సంచలనాత్మక రికార్డు అని ఆయన ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "నిన్న హర్మూజ్ జలసంధి నుంచి 19 మిలియన్ బ్యారెళ్ల చమురు సరఫరా అయింది. ఇది ఒక సరికొత్త రికార్డు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ప్రపంచం ఇప్పుడు మరింత సురక్షితమైన ప్రదేశంగా మారింది" అని ఆయన పేర్కొన్నారు. ఈ సానుకూల పరిణామంతో అంతర్జాతీయ విపణిలో ముడి చమురు ధరలు తగ్గాయి. నిరసనలు, తప్పుడు ప్రచారాల ద్వారా అమెరికా విజయాన్ని తక్కువ చేసే ప్రయత్నాలు జరిగినప్పటికీ, భవిష్యత్తులో అత్యున్నత స్థాయి అణు తనిఖీలకు ఇరాన్ అంగీకరించిందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యకలాపాలపై పారదర్శకతకు ఇది భరోసా ఇస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకవేళ ఇరాన్ ఈ నిబంధనలకు కట్టుబడి ఉండకపోతే, తదుపరి చర్చలకు తావుండదని హెచ్చరించారు. ఇరాన్ చేసిన కొన్ని ప్రతిపాదనల ప్రాతిపదికన, ఎలాంటి దిగ్బంధనం లేకుండా హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు తాను అంగీకరించినట్లు ట్రంప్ వివరించారు. ఒకవేళ తిరిగి దిగ్బంధనాన్ని విధిస్తే నౌకల రాకపోకలు ఎక్కడికక్కడే నిలిచిపోతాయని, అయితే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో అటువంటి అవసరం రాకపోవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఒప్పందంలో భాగంగా అమెరికా విడుదల చేసే నిధులను ఇరాన్ కేవలం ఆహారం, వైద్య సామగ్రి వంటి అత్యవసరాల కోసమే వినియోగించగలదని, వాటిని కూడా కేవలం అమెరికా నుంచే కొనుగోలు చేయాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ సముద్ర వాణిజ్యంలో దాదాపు 20 శాతం చమురు రవాణా సౌదీ అరేబియా, యూఏఈ, ఇరాక్ వంటి దేశాల నుంచి హర్మూజ్ జలసంధి ద్వారానే సాగుతుంది. గత కొంతకాలంగా ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలు, దిగ్బంధనాల కారణంగా ఈ మార్గంలో చమురు సరఫరాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడి ధరలు పెరిగాయి. అయితే, తాజా ఒప్పందంలో భాగంగా అణు తనిఖీలకు ఇరాన్ సమ్మతించడంతో ప్రాంతీయ ఉద్రిక్తతలు సద్దుమణిగాయి.

# ఉద్యోగులపై వరాల జల్లు భారీ పెట్టుబడులకు ఆమోదం

మొదటిపేజీ తరువాయి – పెట్టుబడులను ఆకర్షించడం, రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయడం, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం, పర్యాటక రంగం అభివృద్ధి వంటి అంశాలపై క్యాబినెట్ ప్రధానంగా దృష్టి సారించింది. సమావేశానంతరం తీసుకున్న నిర్ణయాలను మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు.

**భారీగా పారిశ్రామిక పెట్టుబడులు**

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించే లక్ష్యంతో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (ఎస్ఐపీబీ) సిఫారసు చేసిన పలు ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. మొత్తం రూ.39,355 కోట్ల పెట్టుబడులతో, 34,610 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పించే పరిశ్రమలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**ఇందులో భాగంగా ఏర్పాటు చేయనున్న కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులు:**

ప్రీమియర్ ఎనర్జీస్ (తిరుపతి): రూ.3,936 కోట్ల పెట్టుబడితో సిలికాన్ వేఫర్, మాడ్యూల్ తయారీ యూనిట్. 540 మందికి ఉపాధి. కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ (అనకాపల్లి): రూ.2,788 కోట్ల పెట్టుబడితో 1000 మెగావాట్ల డేటా సెంటర్. ప్రొటేరియల్ ఇండియా (అనకాపల్లి): రూ.2,250 కోట్ల పెట్టుబడితో నియోడిమియం ఐరన్ బోరాన్ మాగ్నెట్ తయారీ పరిశ్రమ. 530 మందికి ఉపాధి. వాఖీమాచీజు ఇండియా (కాకినాడ): రూ.1,900 కోట్ల పెట్టుబడితో వాడిన వంట నూనెల నుంచి విమాన ఇంధనం తయారు చేసే యూనిట్. 2,500 మందికి ఉపాధి. ఎన్ఎస్ మాగ్నటెక్ (తిరుపతి): రూ.1,250 కోట్ల పెట్టుబడితో రేర్ ఎర్త్ పర్మనెంట్ మాగ్నెట్ తయారీ. 400 మందికి ఉపాధి. ఏపీ జేఎస్‌డబ్ల్యూ స్టీల్ (ప్రకాశం): రూ.1,230 కోట్లతో స్టీల్ బెనిఫికేషన్ ప్లాంట్. వీటితో పాటు రేర్ ఎర్త్ మెటల్స్ వెలికితీత, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రంలో పారిశ్రామికంగా ఎండ్-టు-ఎండ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**అమరావతికి జవసత్వాలు**

ఐదేళ్లుగా నిలిచిపోయిన రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు క్యాబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంది. అమరావతిలో డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ కోసం గతంలో టాబ్ బ్రీడ్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 35,000 టన్నుల సామర్థ్యంతో కొత్త వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయం. ల్యాండ్ పూలింగ్ రైతులకు కేటాయించిన ప్లాట్లలో రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల పనులకు సంబంధించిన టెండర్లకు ఆమోదం. రైతుల ప్లాట్ల సరిహద్దుల వివాదాలను పరిష్కరించేందుకు అవసరమైన రెక్టిఫికేషన్ డీడ్‌లపై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల నుంచి మినహాయింపు. పనుల పర్యవేక్షణ కోసం ఏపీసీఆర్‌డీఏలో 95 తాత్కాలిక పోస్టుల (డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు) మంజూరు. ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ భవన నిర్మాణానికి రూ.130.38 కోట్లకు టెండర్ ఆమోదం.

ఉద్యోగులకు శుభవార్త

ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్లపై క్యాబినెట్ సానుకూలంగా స్పందించింది. 2004కు ముందు నోటిఫికేషన్ పొంది, ఆ తర్వాత నియామకం అయిన 2003 డీఎస్సీ టీచర్లు, 10/99 గ్రూప్–1 ఉద్యోగులు సహా మొత్తం 10,715 మంది సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) వర్తింపజేయాలని నిర్ణయించింది. షెడ్యూల్ 9, 10 పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 62 ఏళ్లు పూర్తికాని రిటైర్డ్ ఉద్యోగులు తిరిగి విధుల్లో చేరేందుకు అవకాశం కల్పించారు.

**పోర్టులు, పర్యాటకం, ఇతర నిర్ణయాలు**

పోర్టుల అభివృద్ధి: కేంద్ర ప్రభుత్వ నూతన చట్టాలకు అనుగుణంగా మచిలీపట్నం పోర్టు పరిధిని 64 కి.మీ. నుంచి 15 కి.మీ.కు, రామయ్యపట్నం పోర్టు పరిధిని 51 కి.మీ. నుంచి 15 కి.మీ.కు కుదిస్తూ నోటిఫికేషన్ల జారీకి ఆమోదం. రామయ్యపట్నం పోర్టును డీబీఎఫ్ఓటీ పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు ఆపరేటర్ నియామకానికి ఆర్ఎఫ్‌పీ జారీకి అనుమతి. పర్యాటకం: గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు 'హోమ్ స్టే', 'బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్' ఏర్పాటును సులభతరం చేస్తూ పర్యాటక పాలసీకి సవరణలు. తిరుపతి మినహా రాష్ట్రంలోని ఇతర విమానాశ్రయాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో బార్లు, రిటైల్ మద్యం దుకాణాల ఏర్పాటుకు నూతన విధానానికి ఆమోదం. రవాణా శాఖ: ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న టూరిస్ట్ బస్సులను రాష్ట్రంలోకి ఆకర్షించేందుకు, ఆల్ ఇండియా టూరిస్ట్ పర్మిట్ వాహనాల త్రైమాసిక పన్నును ప్రతి సీటుకు రూ.4,000 నుంచి రూ.2,500కు తగ్గింపు.ఆరోగ్యశ్రీ: నెట్‌వర్క్ ఆసుపత్రులకు బిల్లుల చెల్లింపులో జాప్యాన్ని నివారించేందుకు "బిల్ డిస్కౌంటింగ్ సిస్టమ్"కు ఆమోదం. దీనివల్ల ఆసుపత్రులు ప్రభుత్వ గ్యారెంటీతో బ్యాంకుల నుంచి తక్షణమే నిధులు పొందవచ్చు.పరిపాలన: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మార్కాపురం, పోలవరం సహా 28 జిల్లాల కలెక్టరేట్లలో పాలనను బలోపేతం చేసేందుకు అదనపు పోస్టుల క్రమబద్ధీకరణకు ఆమోదం.పునరుత్పాదక ఇంధనం: కడప జిల్లాలో 1000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ఏపీఎస్పీసీఎల్‌కు భూమి కేటాయింపు. యాగంటి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని 1000 మెగావాట్ల నుంచి 1500 మెగావాట్లకు పెంచేందుకు ఆమోదం. ఈ మేరకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్న అంశాలను మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు. ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

### 8 మంది రెబెల్ ఎమ్మెల్యేలపై

## వేటు వేసిన మమతా బెనర్జీ

మొదటిపేజీ తరువాయి – దశాబ్దాలుగా ఏకఛత్రాధిపత్యంగా నడిపిస్తున్న అధినేత్రి మమతా బెనర్జీ స్థానంలో కొత్త అధ్యక్షుడిని ప్రకటిస్తూ రెబల్ వర్గం సంచలన నిర్ణయం తీసుకుంది. దీనికి రివర్స్ కౌంటర్‌గా మమతా బెనర్జీ 8 మంది రెబల్ ఎమ్మెల్యేలపై వేటు వేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ తన మాజీ రైట్ హ్యాండ్, మాజీ మంత్రి ఫిర్హాద్ హకీమ్‌తో పాటు మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్యేలను పార్టీ నుంచి మమత శాశ్వతంగా బహిష్కరించారు. బహిష్కరణకు గురైన వారిలో ఫిర్హాద్ హకీమ్, జావేద్ అహ్మద్ ఖాన్, అరూప్ రాయ్ (రెబల్స్ ప్రకటించిన కొత్త ప్రెసిడెంట్), రథిన్ ఘోష్, బిప్లబ్ మిత్ర, సబీనా యాస్మిన్, స్నేహాశిష్ చక్రవర్తి, మాజీ మంత్రి అరూప్ బిశ్వాస్ ఉన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో మొత్తం ఉన్న టీఎంసీ ఎమ్మెల్యేల్లో మెజారిటీ నేతలు తమవైపే ఉన్నారని తిరుగుబాటు వర్గం చెబుతోంది. మొత్తం 80 మంది టీఎంసీ ఎమ్మెల్యేల్లో 60 మంది సపోర్ట్ తమకే ఉందని రెబల్స్ ప్రకటించారు. ఇప్పటికే 28 మంది టీఎంసీ లోక్‌సభ ఎంపీల్లో 20 మంది ఎంపీలు గ్రూప్‌గా విడిపోయి.. 'నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా'లో విలీనమైన తరుణంలో... మెజారిటీ ఎమ్మెల్యేలు తిరగబడటం మమతా బెనర్జీ పార్టీ మనుగడకే ముప్పుగా మారింది.

## స్టాలిన్ మేనరిజంను అనుకరించి చూపించిన విజయ్

మొదటిపేజీ తరువాయి – ముఖ్యమంత్రి విజయ్, ప్రతిపక్ష డీఎంకే మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం నడిచింది. ముఖ్యమంత్రి ప్రసంగానికి నిరసనగా డీఎంకే సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. శాసనసభలో ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ, డీఎంకే పార్టీ పేరుతో అక్రమంగా నిధులు సేకరిస్తోందని ఆరోపించడంతో పాటు, అవినీతికి పాల్పడిన వారిని తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల గురించి ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనల్లో వాస్తవం లేదని, అవన్నీ రాజకీయ ప్రేరేపితమైనవేనని ఆయన విమర్శించారు. విజయ్ ప్రసంగానికి డీఎంకే సభ్యులు పదేపదే అడ్డుతగలడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. స్పీకర్ జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేసినప్పటికీ, డీఎంకే సభ్యులు నినాదాలు చేస్తూ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఇదే సమయంలో విజయ్ తన ప్రసంగంలో డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను అనుకరించడం అందరి దృష్టిని ఆకర్షించింది. గతంలో సీట్ల పంపకాల చర్చల సందర్భంగా "అంతా సెటిల్ అయిపోయింది" అనేలా స్టాలిన్ ప్రదర్శించిన మేనరిజంను విజయ్ అసెంబ్లీలో అనుకరించి చూపించారు. దీంతో అధికార పక్ష సభ్యులు చప్పట్లతో సభ హోరెత్తింది. తమ ప్రభుత్వం సీపీఎం, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ వంటి పార్టీలతో పొత్తు పెట్టుకోవడాన్ని ఈ సందర్భంగా విజయ్ సమర్థించుకున్నారు. ప్రజాధనాన్ని దోచుకునే ప్రసక్తే లేదని, మహిళల భద్రతతో పాటు మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

# 'ప్రపంచాన్నే అధిగమిస్తాం' కిమ్ అణు ప్రకటనతో కలకలం!

మొదటిపేజీ తరువాయి – దేశ అణ్వస్త్ర సామర్థ్యాన్ని మరింతగా పెంచి "ప్రపంచాన్నే అధిగమించే స్థాయికి తీసుకెళ్లాలి" అని ఆ దేశాధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ పిలుపునిచ్చారు. కొరియా వర్కర్స్ పార్టీ కీలక సమావేశంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు యావత్ ప్రపంచాన్ని కలవరానికి గురిచేస్తున్నాయి.

**అణ్వస్త్రాలే ప్రధాన బలం**

మూడు రోజుల పాటు జరిగిన పార్టీ కేంద్ర కమిటీ సమావేశంలో దేశ రక్షణ, ఆర్థిక విధానాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అణ్వస్త్రాలే దేశ సైనిక సార్వభౌమత్వానికి కేంద్రబిందువని కిమ్ స్పష్టం చేశారు. మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల్లో అణ్వస్త్ర దేశంగా తన స్థానాన్ని మరింత బలపరచుకోవడమే సరైన మార్గమని సమావేశం తీర్మానించింది. అణు సాంకేతికత ఆధారంగా మరిన్ని రక్షణ ప్రాజెక్టులను వేగంగా అమలు చేయాలని కిమ్ ఆదేశించారు.


**దక్షిణ కొరియాపై మళ్లీ విమర్శలు**

దక్షిణ కొరియాను తమ "ప్రధాన శత్రుదేశం"గా ఉత్తర కొరియా మరోసారి అభివర్ణించింది. అమెరికా–దక్షిణ కొరియా సైనిక సహకారాన్ని తీవ్రంగా విమర్శించింది. ఇటీవల జరిగిన న్యూక్లియర్ కన్సల్టేటివ్ గ్రూప్ (ఎన్‌సీజీ) సమావేశం తమపై అణు యుద్ధ ప్రణాళికలకే వేదికగా మారిందని ఆరోపించింది. దక్షిణ సరిహద్దు భద్రతను మరింత బలోపేతం చేయాలని, కొత్త నౌకాదళ స్థావరాలు నిర్మించాలని కిమ్ సూచించారు.

**యుద్ధ నౌకల నిర్మాణానికి వేగం**

10 వేల టన్నుల సామర్థ్యం గల వ్యూహాత్మక క్షిపణి క్రూజర్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సమావేశం నిర్ణయించింది. సరిహద్దు ప్రాంతాల్లో కొత్త ఆయుధ వ్యవస్థల మోహరింపుపైనా దృష్టి పెట్టింది. ఇదే సమయంలో పార్టీ అగ్ర నాయకత్వంలో మార్పులు చోటుచేసుకున్నాయి. కొందరు కీలక నేతలకు పదోన్నతులు లభించగా, మరికొందరిని పదవుల నుంచి తప్పించారు.

# కేసీఆర్ మౌనమూ.. రేవంత్‌కు భయమే!



తెలంగాణ ఉద్యమ కాలంలో కేసీఆర్ ఉపన్యాసాలు ఉద్యమంపై ఎంత ప్రభావం చూపాయో, తెలంగాణ సాధనలో ఆయన మౌనం కూడా అంతటి ప్రభావం చూపించింది. ఇప్పుడు అదే తరహాలో కేసీఆర్ మౌనం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని భయపెడుతున్నది. కేసీఆర్ మౌనాన్ని ఇపుడు రేవంత్ తట్టుకోలేకపోతున్నారు. కేసీఆర్‌ను బూతులతో తిట్టడం ద్వారా, ఆయన చావును కోరుకోవడం ద్వారా సీఎం తరచూ తన అల్పబుద్ధిని బయటపెట్టుకుంటున్నారు. ఎన్ని రకాలుగా తన కురుచబుద్ధిని ప్రదర్శిస్తున్నా అందుకు కేసీఆర్ సమాధానం చెప్పకపోవడంతో ఆయనలో మరింత అసహనం పెరుగుతున్నది. భారతీయ ఆధ్యాత్మిక గురువు ఓషో రజనీష్ తన ఉపన్యాసాల్లో మౌనంగా ఉండడం నేర్చుకోండి (చుప్ రహనా సీఖో) అనే మాటలు కేసీఆర్ మౌనానికి, అతిగా మాట్లాడే రేవంత్‌రెడ్డి అల్పత్వానికి సరిగ్గా సరిపోతాయి. మౌనం మీద, ఎక్కువగా మాట్లాడడం మీద సాధారణంగా ఉండే అభిప్రాయాలకు భిన్నమైన అభిప్రాయాలను తన ఉపన్యాసాల్లో ఓషో ఎంతో చక్కగా వివరించేవారు. మౌనంగా ఉండడం నేర్చుకున్నవారే విజయం సాధిస్తారు. ప్రపంచాన్ని పాలించేది లొడలొడమని ఎక్కువగా మాట్లాడేవారు కాదు.. 'మౌనంగా ఉండేవాళ్లే ప్రపంచాన్ని పాలిస్తారు. ఎక్కువగా మాట్లాడేవారు తమ రహస్యాలను బయటపెడుతారు. సహజంగా వీరి బుర్ర ఖాళీగా ఉంటుంది. మౌనంగా ఉండేవాళ్లు రహస్యంగా మారుతారు. సాధారణంగా మనుషులకు ఉండే అతి పెద్ద భ్రమ 'నేను మాట్లాడకపోతే ప్రజలు నన్ను బలహీనుడిగా భావిస్తారు' అని అనుకుంటారు. కానీ సత్యం దీనికి భిన్నమైనది. 'బలహీనుడు తనను తాను నిరూపించుకోవడానికి ఎక్కువగా మాట్లాడుతాడు. శక్తివంతుడు మౌనంగా ఉంటాడు. అతనికి నిరూపించుకోవాల్సిన అవసరం లేదు' ఇలా సాగుతుంది ఓషో ఉపన్యాసం. కేసీఆర్ మౌనాన్ని బూతుల ద్వారా రెచ్చగొట్టడానికి రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాలను చూస్తుంటే ఓషో ఉపన్యాసం అక్షర సత్యం అనిపిస్తుంది. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్సార్ సీఎంగా ఉన్నపుడు ఒకసారి శాసన సభలో చంద్రబాబుపై వ్యంగ్యాస్త్రాలు విసురుతూ..'భయపడేవారంతా నా చుట్టూ చేరండి' అన్నాడట వెనుకటికొకరు. నిజానికి అందరికన్నా ఎక్కువ భయపడుతున్నది ఆయనే. ఇపుడు బాబే ఎక్కువ భయపడుతూ అదే మాట అంటున్నారని వైఎస్సార్ వ్యంగ్యోక్తి విసిరారు. సరిగ్గా ఇప్పుడు కూడా రేవంత్‌రెడ్డి అదే చేస్తున్నారు. సీఎం పదవి చేపట్టినా ఆ స్థాయి హుందాతనం ఆయనలో కొరవడింది. అదేదో ఇపుడే మొదలైందని కాదు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి రేవంత్‌రెడ్డి సీఎం కాగానే అప్పటి ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనను అభినందించలేదని గతంలో విలేకరుల సమావేశంలోనే ఆయన చెప్పుకొచ్చారు. జగన్ అభినందించారో లేదో తెలియదు కానీ ఒక సీఎం వంటి ఉన్నత పదవిలో ఉంటూ వాళ్లు అభినందించలేదు.. వీళ్లు అభినందించలేదని వాపోవడం విచిత్రం. ఒక కార్పొరేటర్ కూడా ఈ స్థాయిలా మాట్లాడరేమో. తన ఇంట్లో కేసీఆర్ జారిపడి చికిత్స పొందుతుంటే రేవంత్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి..రాహుల్ గాంధీ వెళ్లమంటే వెళ్లానని చెప్పడం అంటే ఎంతటి కురుచబుద్ధో స్పష్టమవుతుంది. కేసీఆర్‌ను ఎలాగైనా రెచ్చగొట్టి అసెంబ్లీకి వచ్చేట్టు చేసి అవమానించాలనే వ్యూహం రేవంత్ మాటల్లో ఎప్పుడూ కనిపిస్తున్నది. ప్రతి సమావేశంలో తాను తిడుతున్నా కేసీఆర్ తిరిగి తిట్టకపోవడంతో రేవంత్‌రెడ్డిలో రోజురోజుకూ అసహనం పెరుగుతున్నది. ఆ అసహనంతోనే ఆయన మరింతగా కేసీఆర్‌ను ఇష్టారీతిన బూతులు తిడుతున్నారు. రేవంత్‌రెడ్డి సీఎం పదవి చేపట్టిన కొత్తలో కేసీఆర్‌ను ఉద్దేశించి తిట్టిన తిట్లు అందరికీ ఆశ్చర్యం కలిగించాయి. సీఎం స్థాయిలో ఉండి, గతంలో ఎవరూ అలా బూతులు మాట్లాడకపోవడం వల్ల రేవంత్ వల్లెవేసే బూతులు రాజకీయ నాయకులకే కాకుండా అధికారులకు సైతం మొదట్లో ఆశ్చర్యం కలిగించాయి. ఇప్పుడు ప్రతి సమావేశంలోనూ ఇవే బూతులు ప్రారంభ గీతంగా మారడంతో అంతా అలవాటుపడిపోయారు. ఇపుడు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అయితే బాధిత ప్రజలు, రైతులు, మహిళలు, నిరుద్యోగులు మాత్రం ఆయన బూతులను మించి బూతులతో ఆయన్నే తిడుతున్నారు. రెండున్నరేండ్ల నుంచి రేవంత్‌రెడ్డి ఎన్ని బూతులు తిడుతున్నా కేసీఆర్ నుంచి మౌనమే సమాధానం వస్తున్నది. రాజకీయాలు అంటే నోటికే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. రేవంత్ రాజకీయాల్లో ఎదిగింది కూడా నోటితోనే. ఆయన అలా బూతులు తిడుతుంటే..మౌనంగా ఉండే బీఆర్ఎస్ శ్రేణులు డీలాపడిపోతారనే వాదనలోనూ వాస్తవం ఉన్నది. ఆ విషయాన్ని గ్రహించే రేవంత్ బూతులకు అదే స్థాయిలో కేటీఆర్ సమాధానం చెప్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడూ నోరు జారే వారు కాదు. కానీ ఆ పార్టీ నేతలు మోత్కుపల్లి నర్సింహులు, నన్నపనేని రాజకుమారి, వర్ల రామయ్య లాంటి వారిని కామన్‌గా అందరినీ తిట్టడానికి ప్రయోగించేవారు. ప్రత్యేకంగా రెడ్డి నాయకులను తిట్టేందుకు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని ప్రయోగించేవారు. తెలంగాణ నాయకులను, అన్నివర్గాల వారిని తిట్టేందుకు తొలుత రోజాకు టీడీపీనే తగిన శిక్షణ, ప్రోత్సాహం అందించింది. టీడీపీ ప్రయోగించిన రోజా అనే ఆయుధం చివరకు వారిపైనే తిరగబడింది. మోత్కుపల్లి నర్సింహులు, వర్ల రామయ్య, నన్నపనేని రాజకుమారి వంటివారు పోషించిన పాత్రను రాష్ట్ర విభజన తరువాత తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక స్వయంగా రేవంత్‌రెడ్డి పోషిస్తున్నారు. అదే స్థాయిలో కేటీఆర్ ఆయనకు బదులిస్తున్నారు. రేవంత్ బూతు పురాణంతో తమ వ్యూహం ఫలించిందని మొదట్లో కొందరు కాంగ్రెస్ నాయకులు సంబురపడ్డారు. అయితే, రెండున్నరేండ్ల పాలనా కాలం ముగిసిన తరువాత కూడా అవే తిట్లను నమ్ముకోవడం ప్రయోజనం లేదని, ప్రజలు హామీల అమలు కోరుతున్నారని పలువురు ఆ పార్టీ నేతలు చెప్తున్నారు. 'పాములు పట్టేవాడు పాము కాటుకే పోయాడు' అనే సామెత మాదిరిగా బూతులతో కాలం వెళ్లదీద్దాం అనుకున్న రేవంత్‌రెడ్డికి అవే బూతులతో ప్రజలు తగిన సమాధానం చెప్తున్నారు.

# హాలహర్వి లో రైతుల సాగునీటి హక్కులను కాలరాస్తున్నారు

**ఎల్.ఎల్.సి కాలువ నీటిని అక్రమంగా దోచుకుంటున్న వారిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి :**

**వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు శ్రీనివాసులు**




**నందవరం,జూన్ 23,(ప్రభ మనం,న్యూస్:** ఎమ్మిగనూరు నియోజకవర్గం నందవరం మండలం పరిధిలోని హాలహర్వి గ్రామంలో మీడియాతో మాట్లాడిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ, హాలహర్వి గ్రామంలో రైతుల సాగునీటి హక్కులను కొందరు రాజకీయ పలుకుబడి కలిగిన వ్యక్తులు బలవంతంగా అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "మా గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 452లో ఎల్.ఎల్.సి కాలువ కింద నాకు వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమికి అనుబంధంగా ఉన్న పిల్ల కాలువ ద్వారా నేను పుట్టకముందు నుంచే మా కుటుంబ సభ్యులు, మా పూర్వీకులు సాగు చేసుకుంటూ వస్తున్నారు. మా తాతల కాలం నుంచి, మా తండ్రుల కాలం నుంచి ఆ పిల్ల కాలువ ద్వారా మా పొలాలకు నీరు వస్తోంది. గ్రామంలోని అనేక మంది రైతులకు కూడా ఇదే కాలువ జీవనాధారంగా ఉంది. అయితే ఇటీవల ఆ కాలువ గడ్డి, మట్టి, పూడికతో పూర్తిగా నిండిపోయి నీటి ప్రవాహం ఆగిపోయే పరిస్థితి ఏర్పడింది. రైతుల అవసరాల కోసం, మా పొలాలకు నీరు చేరేలా చేయాలనే ఉద్దేశంతో మాత్రమే ఆ కాలువను శుభ్రం చేయించాము. కానీ రైతుల ప్రయోజనం కోసం చేసిన ఈ పనిని కూడా కొందరు రాజకీయ కక్షతో సమస్యగా మార్చారు" అని శ్రీనివాసులు తెలిపారు. "గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, మాజీ ఎంపీపీ కుమారులైన గోవర్ధన్ రెడ్డి, నారాయణ రెడ్డి మా పొలం వద్దకు వచ్చి అత్యంత దురుసుగా ప్రవర్తించారు. మాపై అసభ్య పదజాలంతో దుర్భాషలాడుతూ, 'మీరు ఎవరు కాలువ తీయడానికి?', 'ఈ కాలువను మేమే మూసివేస్తాం', 'మీరు ఎక్కడికి వెళ్లి చెప్పుకుంటారో చెప్పుకోండి', 'ఈ గ్రామంలో మా మాటే చెల్లుతుంది' అంటూ బెదిరింపులకు దిగారు. రైతులకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో చేసిన పనిని కూడా అడ్డుకోవడం దుర్మార్గం. మా హక్కులను హరించడమే కాకుండా మమ్మల్ని భయపెట్టే ప్రయత్నం చేయడం అత్యంత బాధాకరం" అని అన్నారు. "ఇది కేవలం నా వ్యక్తిగత సమస్య కాదు. హాలహర్వి గ్రామంలోని చిన్న, సన్నకారు రైతుల సమస్య. గ్రామంలో చాలా మంది రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. కానీ కొందరు వ్యక్తులు రాజకీయ అధికారాన్ని, పలుకుబడిని అడ్డుపెట్టుకొని ప్రజలకు చెందిన నీటిని తమ సొంత ఆస్తిలా ఉపయోగించుకుంటున్నారు. గోవర్ధన్ రెడ్డి ఎల్.ఎల్.సి కాలువల నుండి, చెరువుల నుండి అక్రమంగా కాలువలు తీసి నీటిని తన వ్యక్తిగత బావుల్లోకి మళ్లించుకొని దాదాపు 45 ఎకరాలకు పైగా భూమిని సాగు చేస్తున్నారని గ్రామ ప్రజలందరికీ తెలుసు. రైతులకు అందాల్సిన నీటిని మధ్యలోనే మళ్లించి తమ భూములను మాత్రమే పండించుకోవడం అన్యాయం. చిన్న రైతులు నీటి కోసం ఎదురు చూస్తుంటే కొందరు వ్యక్తులు ప్రజల నీటిని దోచుకొని తమ వ్యవసాయానికి వినియోగించుకోవడం రైతు సమాజానికి చేసిన ద్రోహం" అని తీవ్రంగా విమర్శించారు. "ఎల్.ఎల్.సి కాలువల నుండి అక్రమంగా నీటిని మళ్లించడం వల్ల ఎంతమంది రైతులు నష్టపోతున్నారో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేస్తే నిజాలు బయటపడతాయి. ఒక వ్యక్తి లేదా ఒక కుటుంబం కోసం ప్రభుత్వ నీటి వనరులు కావు. ప్రజలందరికీ సమాన హక్కు ఉంటుంది. కానీ ప్రస్తుతం హాలహర్వి గ్రామంలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది" అని అన్నారు. "హాలహర్వి గ్రామంలోని బీవీ కాలనీలో కూడా అనేక అక్రమాలు జరిగాయి. పేదలకు ప్రభుత్వం ఇచ్చిన వందలాది ఇంటి పట్టాలలో ముప్పావు వంతు పట్టాలను అక్రమంగా దోచుకొని, ఒక్కో పట్టాకు రూ.30 వేల వరకు వసూలు చేసి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు గ్రామ ప్రజల్లో ఉన్నాయి. పేదల కోసం ఇచ్చిన భూములను కొందరు వ్యక్తులు వ్యాపారంగా మార్చుకోవడం దారుణం. ఈ అంశంపై కూడా సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. "ఇంత అన్యాయం జరుగుతున్నా మాపైనే పోలీసులకు ఫిర్యాదు చేయడం విచిత్రం. సివిల్ స్వభావం కలిగిన ఈ వివాదంలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సి ఉండగా, మాపై ఒత్తిడి తీసుకురావడం బాధాకరం. నందవరం పోలీసు సిబ్బంది మాతో మాట్లాడిన తీరు కూడా అభ్యంతరకరంగా ఉంది. అధికార పార్టీ నాయకులకు వ్యతిరేకంగా ఏదైనా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, తప్పుడు కేసులు పెడతామని, గంజాయి కేసులు, మట్కా కేసులు కూడా బనాయిస్తామని బెదిరించడం జరిగింది. చట్టాన్ని అమలు చేయాల్సిన వ్యవస్థే రైతులను భయపెట్టడం అత్యంత దురదృష్టకరం" అని శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. "నేను ఒక రైతును. రైతుల సమస్యల కోసం పోరాడుతున్న వ్యక్తిని. రైతులకు రావాల్సిన నీటిని రైతులకు అందించాలని అడిగినందుకు మమ్మల్ని బెదిరించడం సరైంది కాదు. ఎల్.ఎల్.సి కాలువల నుండి జరుగుతున్న అక్రమ నీటి మళ్లింపులపై, రైతుల సాగునీటి హక్కులను అడ్డుకుంటున్న వారిపై, బీవీ కాలనీ పట్టాల అక్రమాలపై మరియు రైతులను బెదిరిస్తున్న వారిపై ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. "లేనిపక్షంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు, మానవ హక్కుల కమిషన్, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ తదితర ఉన్నత స్థాయి సంస్థలను ఆశ్రయించి న్యాయం కోసం చట్టబద్ధంగా పోరాటాన్ని కొనసాగిస్తాము. రైతుల హక్కులను కాపాడే వరకు వెనక్కి తగ్గేది లేదు" అని శ్రీనివాసులు స్పష్టం చేశారు.

# రాయలసీమలో 'పసిడి' పంట

- స్వర్ణగిరిగా ఇక జొన్నగిరి
- రూ.405 కోట్లతో జియో మైసూర్ సర్వీసెస్, డెక్కన్ గోల్డ్ మైన్స్ పెట్టుబడి
- ఏడాదికి 400 కేజీలు, 900 కేజీలు, 2 టన్నులు-దశల వారీగా పెరగనున్న బంగారం వెలికితీత
- ఉత్పత్తి అయిన బంగారం విలువలో రాష్ట్ర ఖజానాకు 4 శాతం రాయల్టీ:
- గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- విస్తరణలో భాగంగా రెండో యూనిట్‌కూ శంకుస్థాపన







తుగ్గలి జూన్ 23 ప్రభ మనం బంగారు నిక్షేపాల గని అంటే కర్ణాటక రాష్ట్రంలోని కేజీఎఫ్ గుర్తొచ్చేది కానీ ఇప్పుడు ఆ స్థానంలో జొన్నగిరి పేరు మారుమోగనుంది.కరవు కేకలు వినిపించిన ఒకప్పటి కర్నూలు జిల్లా ఇక బంగారం ఉత్పత్తికి ప్రధాన వేదిక కానుంది.దేశంలోనే ప్రైవేట్ రంగంలో అతిపెద్ద గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు కర్నూలు జిల్లా జొన్నగిరిలో ఏర్పాటైంది.జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్‌కు ప్రభుత్వం 1,500 ఎకరాల భూమిని కేటాయించింది.ప్రస్తుతం మొదటి దశలో 600 ఎకరాల్లో తవ్వకాలు జరగనున్నాయి. దీనికి తగినట్టుగా ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. రెండో దశలో మిగిలిన ప్రాంతంలోనూ ప్లాంట్ విస్తరించున్నారు.ప్రస్తుతం ఏర్పాటైన ఈ ప్లాంట్ ద్వారా తొలి ఏడాదికి 400 కిలోల పసిడిని ఉత్పత్తి చేయనున్నారు.వచ్చే ఏడాది నుంచి 900 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తారు.ఈ రకంగా ఏ ఏడాదికి ఆ ఏడాది ఉత్పత్తి పెరుగుతూ ఏడాదికి 2 టన్నుల వరకు బంగారం ఉత్పత్తి చేయనున్నారు.ఈ మేరకు ప్లాంట్ సామర్థ్యాన్ని ప్రాసెసింగ్ కెపాసిటీని విస్తరించనున్నారు.ఈ ప్లాంట్ ద్వారా 700 మందికి ఉపాధి లభిస్తుంది.ఇక ఉత్పత్తి చేసిన బంగారం ధరలో 4 శాతం రాష్ట్రానికి రాయల్టీగా వస్తుంది.మొదట తీసే 400 కేజీలకు రూ.57 కోట్లు, 900 కేజీలకు రూ.144 కోట్ల వరకూ రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం రానుంది.

### ప్రారంభోత్సవం - శంకుస్థాపన

కర్నూలు జిల్లా,తుగ్గలి మండలం,జొన్నగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు.అనంతరం ప్లాంట్ విస్తరణలో భాగంగా రెండో యూనిట్‌కూ శంకుస్థాపన చేయనున్నారు. జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థలు రూ.405 కోట్ల పెట్టుబడితో బంగారు నిక్షేపాలు వెలికితీసే ఈ కర్మాగారాన్ని నెలకొల్పాయి. ఇందుకు అవసరమైన నీటి కోసం హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా 18 కి.మీ. పైపులైన్‌తో 0.021 టీఎంసీలను వినియోగించ నున్నారు.ఈ మేరకు రేపు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా బంగారం ఉత్పత్తి పనులు ప్రారంభం కానున్నాయి.దీనికి సంబంధించి ఇప్పటికే గనిలో ట్రయల్ రన్స్ కూడా పూర్తయ్యాయి.

### ముఖ్యమంత్రి పర్యటన వివరాలు

కర్నూలు జిల్లాలో బుధవారం సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. జొన్నగిరిలో బంగారం శుద్ధి కర్మాగారం ప్రారంభోత్సవం సహా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.ఈ పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి 11.30 గంటలకు జొన్నగిరికి చేరుకుంటారు. 11.45 గంటలకు ప్లాంట్ మొదటి యూనిట్ ను ప్రారంభించి అనంతరం జీఈఓ మైసూర్ ప్లాంట్ రెండో యూనిట్‌కు శంకుస్థాపన చేయనున్నారు.ఆ తర్వాత మధ్యాహ్నం 12.20 గంటలకు జొన్నగిరిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు.3 గంటలకు పత్తికొండ నియోజకవర్గ టీడీపీ నేతలు,కార్యకర్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అవుతారన్నారు.

# జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్రారంభోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు

**హెలిప్యాడ్, వ్యూ పాయింట్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి**









**తుగ్గలి, జూన్ 23 ( ప్రభ మనం న్యూస్ ):** తుగ్గలి మండలం పగిడిరాయి సమీపంలో జియో మైసూర్ గోల్డ్ మైన్స్ ప్లాంట్ ను ఈ నెల 24వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, వ్యూ పాయింట్, బహిరంగ ప్రదేశాలు, భద్రతా ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హెలిప్యాడ్ ప్రాంతంలో భద్రతా ప్రమాణాలు, పారిశుద్ధ్యం, రాకపోకల సౌకర్యాలు, తాగునీరు తదితర మౌలిక వసతులను పక్కాగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర స్థాయి ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యే అవకాశం ఉండటంతో భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం పర్యటన విజయవంతంగా జరిగేలా ప్రతి విభాగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొని ఏర్పాట్లపై కలెక్టర్‌కు వివరాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఓబులేసు డిఎస్పి వెంకటరామయ్య తహసిల్దార్ రవి ఎంపీడీవో విశ్వమోహన్ సిఐ పులి శేఖర్ ఎస్ఐలు మల్లికార్జున నరేష్ మైన్స్ జిఎం బాలాజీ విఆర్ఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# జీవితపు ఎడారిలో..



తోబుట్టువులు, అన్నదమ్ముల జీవితాలలో వెలుగులు నింపడం కోసం ఎడారి ప్రవాసానికి వచ్చే అనేక మంది చివరకు కుటుంబ జీవితాలకు... తోబుట్టువులు, అన్నదమ్ముల జీవితాలలో వెలుగులు నింపడం కోసం ఎడారి ప్రవాసానికి వచ్చే అనేక మంది చివరకు కుటుంబ జీవితాలకు, ఆప్యాయతలకు దూరమవుతున్నారు. ఈ కారణంగా మానసిక ఒత్తిళ్ళకు గురవుతూ అనారోగ్యం పాలవుతున్న ప్రవాసులు ఎందరో ఉన్నారు. అహర్నిశలు కష్టపడి పైసకు పైసా జతచేసి కుటుంబాలకు పంపితే కష్టం తెలియని కుటుంబాలు డబ్బుతో మాత్రమే తమకు పని అని, మనిషితో కాదన్నట్టుగా వ్యవహరిస్తున్నాయి. యవ్వనంలోకి అడుగుపెట్టిన తొలినాళ్ళలోనే ఎడారులకు చేరుకుని అరబ్బుల పెత్తనంపై పోరాడి గెలిచినప్పటికీ ఇంట్లో అన్నదమ్ములతో ఓడిపోయి చివరకు రిక్తహస్తాలతో, నిరాశా నిస్పృహలతో కొట్టామిట్టాడుతున్నారు. అనారోగ్యంతో మరణించిన తండ్రి, అడుగడుగున ఉన్న అప్పులు, పట్టించుకోని బంధువులు. అరకొరగా కూలీ చేసి సంపాదించే అన్నకు తోడుగా కుటుంబానికి చేయూతనిచ్చేందుకు వచ్చిన నెల్లూరు జిల్లా యువకుడు ఒకరు తన ఆప్తుల కోసం సర్వం త్యాగం చేశాడు. యజమాని కాఠిన్యాన్ని భరిస్తూ ఆకలితో గడిపాడు. అలా ఎంతో కష్టపడి సంపాదించిందంతా ఆ యువకుడు అన్నకు పంపగా, అతడు తన పిల్లల పెళ్ళిళ్లు చేశాడు, చదువులు చెప్పించాడు. తమ్ముడు పంపిన డబ్బుతో తన పేర ఆస్తులను కొను గోలు చేసిన ఆ అన్న ఇప్పుడు మొత్తం తనదేనంటున్నాడు. అన్యాయం జరిగితే న్యాయస్థానానికి వెళ్ళి కేసు వేసుకోమంటున్నాడు. ఏళ్లకు ఏళ్ళు కష్టపడి, స్వదేశానికి తిరిగి వెళ్ళిన తమ్ముడు తనకు జరిగిన మోసం గురించి బంధుమిత్రులతో చెప్పి బోరుమన్నాడు. చేసేది లేక పాత మిత్రుల సహాయంతో వీసా పొంది మళ్ళీ గల్ఫ్‌కు తిరిగి వచ్చాడు కానీ అనారోగ్యం వల్ల సక్రమంగా ఉద్యోగం చేయలేకపోతు న్నాడు. అలాగని ఆర్థిక కారణాలతో స్వదేశానికి వెళ్ళడానికీ వెనుకంజ వేస్తున్నాడు, షుగర్ వ్యాధితో కళ్ళు సరిగ్గా కనిపించకపోయినా తన పిల్లల కోసం ఏడ్చుకొంటూ పని చేస్తు న్నాడు, ఇక్కడి నుంచి అతడు పంపే డబ్బు కొరకు భార్య, పిల్లలు ప్రతి నెలా ఆతృతగా ఎదురు చూస్తుంటారు. మెదక్ జిల్లాకు చెందిన మరో యువకుడికి ఏడుగురు తమ్ముళ్ళు, చెల్లెళ్ళు. టైలరింగ్ పని చేసే తండ్రి అనారోగ్యంతో మంచం పాలవగా అప్పులు పెనుభారంగా మారాయి. కుటుంబం గడిచీ గడవక నెట్టుకొచ్చేది. దానికి తోడు పెళ్ళికి ఎదుగుతున్న చెల్లెళ్లు, తమ్ముళ్ళ చదువు ఎలాగా అనుకుంటూ అందరికంటే పెద్దవాడయిన అన్న డిగ్రీ చదువును వదిలిపెట్టి అప్పులు చేసి ఎడారి విమానమెక్కాడు. చెల్లెళ్ల వివాహాలను ఘనంగా జరిపించాడు. సంపాదించిన ప్రతి నయా పైసా ఇంటికి పంపించాడు. లక్షలలో సంపాదించినా కనీసం బ్యాంకు ఖాతా కూడ తెరుచుకోలేదు. అన్న గల్ఫ్‌కు వెళ్ళేవరకు అన్నం కోసం తిప్పలు పడ్డ ఆ కుటుంబం గతాన్ని మరిచిపోయింది. కాపురానికి వచ్చిన భార్య భర్త కష్టార్జితం రాళ్ళపాలవుతోందని గ్రహించే సరికి కుటుంబ కలహాలు పెరిగాయి. సంపాదించిన ఆస్తులను తమ్ముళ్ళు, బావలు గుంజుకున్నారు. జీవితంలో ఎక్కువకాలం విదేశాలలో గడపడంతో తోబుట్టులను అర్థం చేసుకోవడంలో విఫలమయ్యాడు. ఇంటింటి కుటుంబ సర్వే సందర్భంగా కనీసం ఇంట్లోకి అతడి పిల్లలను కూడ రానివ్వలేదు. ఎవరి కోసం తాను రేయింబవళ్ళు కష్టపడ్డాడో వాళ్లే పరాయివారు కావడాన్ని తట్టుకోలేకపోయాడు. పని చేసేందుకు ఓపిక లేకపోయినా తన పిల్లల కోసం కష్టపడ్డాడు. చివరకు అతడు ప్రవాసంలోనే అనారోగ్యంతో కన్నుమూయగా స్వదేశంలో అతడి పిల్లలు, భార్య అతికష్టంగా బతుకీడుస్తున్నారు. భార్య పగటిపూట ఒక ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా, రాత్రి పూట ఇంట్లో బట్టలు కుడుతుండగా ఆమె భర్త సంపాదనతో ఎదిగిన వారందరు హాయిగా ఉన్నారు. ఈ రకంగా కుటుంబ బాధ్యతలతో చిన్న వయస్సులో ఎడారులకు వచ్చి చివరకు తమ జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకున్న తెలుగు ప్రవాసులు అసంఖ్యాకంగా ఉన్నారు. వారి మనోవేదన అర్థం చేసుకోగల వారెవ్వరు?

# బంగ్లాదేశ్ జాతిపితగా ముజిబుర్ పేరు తొలగింపు



బంగ్లాదేశ్‌లోని మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆ దేశ జాతిపితగా బంగబంధు షేక్ ముజిబుర్ రెహమాన్ పేరును తొలగించింది. ఈ మేరకు ఆ దేశ లా అండ్ జస్టిస్ పార్లమెంటరీ సంబంధాల మంత్రిత్వ శాఖ మంగళవారం రాత్రి ఆర్డినెన్స్ జారీచేసింది. స్వాతంత్ర్య సమరయోధుడు.. పదానికి కొత్త నిర్వచనం ఇస్తూ, ఓ చట్టాన్ని యూనస్ ప్రభుత్వం సవరించిందని, జాతిపిత అన్న బిరుదును షేక్ ముజిబుర్ రెహమాన్‌కు తొలగించినట్టు 'ఢాకా ట్రిబ్యూన్' వార్తా కథనం పేర్కొన్నది. మాజీ ప్రధాని షేక్ హసీనా తండ్రి ముజిబుర్ రెహమాన్ చిత్రపటాన్ని కరెన్సీ నోట్ల నుంచి తొలగించిన కొద్ది రోజుల్లోనే యూనస్ ప్రభుత్వం ఈ చర్యను చేపట్టింది. 'బంగ్లాదేశ్ విముక్తి యుద్ధానికి యూనస్ ప్రభుత్వం కొత్త నిర్వచనం తీసుకొచ్చింది. బంగబంధు స్వాతంత్ర్య పిలుపు మేరకు యుద్ధం జరిగిందని, బంగ్లాదేశ్ విమోచనం పొందిందని ఇంతకుముందున్న చట్టం పేర్కొన్నది' అని అంటూ 'ద డెయిలీ స్టార్' న్యూస్ పేపర్ పేర్కొన్నది.

# రాజస్థాన్‌లో నకిలీ ఎరువుల రాకెట్




నకిలీ ఎరువులు, నాణ్యత లేని విత్తనాలను తయారు చేస్తున్న 30 పరిశ్రమలపై రాజస్థాన్ ప్రభుత్వం దాడులు చేసింది. జైపూర్, కిషన్‌గఢ్, శ్రీ గంగా నగర్ తదితర పారిశ్రామిక ప్రాంతాల్లో ఇటీవల ఈ సోదాలు కొనసాగాయి. పాలరాయి వ్యర్థాలు, రాతి తునకలు(స్టోన్ డస్ట్), రంగులను వాడి తయారు చేసిన నకిలీ ఎరువులను మార్కెట్లోని కొన్ని రకాల బ్రాండ్ల పేరుతో అమ్ముతున్నట్టు వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. ఇఫ్కో లేబుల్ కలిగిన ఈ నకిలీ ఎరువులను నిత్యం రెండు లక్షలకు పైగా సంచుల చొప్పున రాజస్థాన్‌తో పాటు హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లోని వేలాది మంది రైతులకు విక్రయిస్తున్నట్టు తేలింది. ఈ నకిలీ ఎరువుల దందాకు కొందరు పర్యవేక్షక అధికారులు సహకరించారని, వారి నిర్లక్ష్యం వల్లే ఈ నకిలీ ఎరువుల అమ్మకాలు యథేచ్ఛగా సాగాయని దర్యాప్తు అధికారులు తెలిపారు.

Office adress....EDITED & PUBLISHED AND OWNED BY.EDITOR : V.LINGAMURTHY. PUBLISHED AT : VSAR PUBLICATION VSAR PUBLICATIONS91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL, ANDHRA PRADESH - 518006CONTACT NO :9000367833.RNI,APTEL/26/A 3829,E-MAIL.ID prabhamanam@gmail.com